క్లుప్తంగా

జంపరకోటలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చిరంజీవి

పాలకొండ రూరల్: స్థానిక పీహెచ్‌సీ పరిధి జంపరకోటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇళ్లకు వెళ్లి రోగుల తాజా ఆరోగ్య పరిస్థితులను వైద్య పరీక్షల ద్వారా నమోదు చేశారు. సాధారణ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి మందులు అందజేశారు. డాక్టర్ కె.చిరంజీవి ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి భూలక్ష్మి, ఏఎన్‌ఎం టి.రామలక్ష్మి, ఎ.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

భవనాల మరమ్మతులకు చర్యలు



కారివలసలో పాఠశాల పైకప్పును పరిశీలిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: మండలంలోని సీమలవానివలస, కారివలస గ్రామాల్లోని పాఠశాలలకు మరమ్మతులను నిర్వహించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేయనున్నట్లు ఎంఈఓ ఎస్.నాగభూషణరావు తెలిపారు. మండలంలోని కారివలస, సీమలవానివలస గ్రామాల్లోని పాఠశాలలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుత వర్షాకాలంలో భవనాల కారణంగా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాలు అధికంగా కురిస్తే విద్యార్థులకు వేరేచోట బోధన నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యాధులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు

సీతంపేట: స్థానిక ఏపీఆర్ పాఠశాలలో మలేరియా నివారణా శాఖ ఆధ్వర్యంలో వ్యాధులపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర దోమల కారక వ్యాధులపై సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు చైతన్యం చేశారు. వెంకటిగూడ, మల్లి గ్రామాల్లో ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.సత్యం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా మూడు పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి భానుప్రతాప్, గ్రామ కార్యదర్శి సుదర్శనరావు పాల్గొన్నారు.

పక్కాగా మెనూ అమలు



వసతిగృహంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో చంద్రబాబు

కురుపాం: వసతిగృహ విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని గిరిజన సంక్షేమ ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పోస్టుమెట్రిక్ వసతిగృహాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమాధికారి సాంబమూర్తిని మెనూ వివరాలు, విద్యార్థుల హాజరు అడిగి తెలుసుకున్నారు. స్టాక్ నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు.

మహిళల పోరాటయాత్రను జయప్రదం చేయాలి

పార్వతీపురంటౌన్: హింసపై మహిళల పోరాటయాత్ర రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని ఐద్వా పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో హింస రోజురోజుకూ పెరుగుతుందని ఢిల్లీలో మహిళా మల్లయోధులు చేసిన ఆందోళన ఇందుకు నిదర్శనమన్నారు. మహిళల పట్ల హింసను అరికట్టేందుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కేంద్ర ప్రభుత్వంపై పోరాటయాత్ర చేపట్టినట్లు తెలిపారు. జూలై 29వ తేదీన మధ్యాహ్నం జిల్లాలోని పాలకొండలో, సాయంత్రం పార్వతీపురం, సీతానగరం సాలూరులకు రాష్ట్ర జాతా వస్తుందని పేర్కొన్నారు. మహిళలు, అభ్యుదయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.గౌరి, బి. జయలక్ష్మి, వి.ఇందిర, జి. తులసి తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'



కురుపాం: మొండెంఖల్ పంచాయతీ కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు



వీరఘట్టంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



గుమ్మలక్ష్మీపురం: పి.ఆమిటిలో లబ్ధిదారునికి సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ రాములమ్మ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కని వేదికగా రూపుదిద్దుకుందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కొనియాడారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించబడుతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం పలు చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం

● ముత్యాలు రహదారి పనులకు ఎమ్మెల్యే కళావతి శంకుస్థాపన



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని ముత్యాలు జంక్షన్ నుంచి కోతా గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మోక్షం కలిగిందన్నారు. దశల వారీగా పాలకొండ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు రహదారి నిర్మాణాలు జరుగుతాయన్నారు. గ్రామాల్లో ఇప్పటికే సీసీ రహదారులు, వరద గోడలు వంటివి నిర్మించడానికి ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, సర్పంచ్‌లు సవర బంగారమ్మ, రాజయ్య, చిరంజీవి, సిమ్మయ్య, ఎంపీటీసీలు ఆదమ్మ, గణేష్, పార్టీ నాయకులు ఎస్.రాము, అబ్బాస్, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలలో వెన్నశాతం పెంచండిలా...

● పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు



ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ

పాలకొండ రూరల్: పాడి రైతులు ప్రస్తుత వర్షాకాలంలో పాలలో వెన్నశాతం తగ్గడంతో ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని దీన్ని అధిగమించేందుకు యాజమాన్య పద్ధతుల్లో స్వల్ప మార్పులు చేపడితే సమస్యలను అధిగమించవచ్చని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు(ఏడీ) ప్రభా మాణిక్యరావు శుక్రవారం పేర్కొన్నారు. పశువులకు అందించే దాణాలో పీచు పదార్థాలు తక్కువగా ఉండడంతో పాటు పశుగ్రాసాలు కూడా తక్కువగా ఇవ్వడం వలన పాలలో వెన్నశాతం తగ్గుతుందని తెలిపారు. పశువులు తిన్న ఆహారమే పాల దిగుబడితో పాటు వెన్నశాతం తగ్గడానికి ప్రధాన కారణమన్నారు. ప్రస్తుత సీజన్‌లో శుభ్రత పాటించకపోవడం వలన పొదుగు సంబంధిత వ్యాధులు కూడా చోటుచేసుకుంటాయని తెలిపారు. వర్షాకాలంలో పాలలో వెన్నశాతం తగ్గడం సహజమని, ఈ సమయంలో పచ్చిక పశువులు మేయడం వలన తక్కువ పీచుపదార్థం, ఎక్కువ చక్కెర ఉండే దాణాను తీసుకోవడం వల్ల సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు. దీన్ని నివారించేందుకు పాలను ఉంచే పెద్ద పాత్రలో ప్రతి 5 నిమిషాలకు ఒకసారి పాలను పూర్తి స్థాయిలో కదుపుతూ ఉండాలని సూచించారు. అలాగే రోజు ఒకే సమయానికే పాలు పితకాలన్నారు. దాణాలో పీచుపదార్థం, పిండిపదార్థం తక్కువగా ఉండేటట్టు చూడాలని తెలిపారు. పశుగ్రాసాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి వేయడంవలన అవి తొందరగా అరుగుదలకు వస్తాయని, దాణాలో ఉండే సూక్ష్మజీవులను తొందరగా అరిగించుకోగలుగుతాయని తెలిపారు. ధాన్యాన్ని పులియబెట్టి వాటిలో ఉండే పిండిపదార్థాలు మెత్తబడే విధంగా చూసి, అటుపై పశువులకు దాణా రూపంలో అందించడం మేలని సూచించారు. ముఖ్యంగా వేడి చేసిన ధాన్యం మేత 35 నుంచి 40 శాతం మించకుండా చూడాలని, మొత్తం దాణాలో 55.5 శాతం మించకుండా కొవ్వుపదార్థాలు ఉంటే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. తద్వారా ప్రస్తుత సీజన్‌లో పాలలో వెన్నశాతం తగ్గకుండా నివారించవచ్చని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఫీవర్ సర్వే చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో జయంత్‌ప్రసాద్

వీరఘట్టం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే పకడ్బందీగా త్వరితగతిన చేపట్టాలని ఎంపీడీవో జయంత్ ప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో ప్రజారోగ్యంపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో మీరందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతీ ఇంటిని సందర్శించి జ్వర పీడితుల వివరాలు సేకరించడంతో పాటు అవసరమైన వారికి రక్త పరీక్షలు చేయాలని సూచించారు. సమావేశంలో వీరఘట్టం, బిటివాడ పీహెచ్‌సీ డాక్టర్లు ఉమామహేశ్వరి, నితీషా, ఈవోపీఆర్‌డీ వి.రామచంద్రరావు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇనుప చక్రాల ట్రాక్టర్లను నడపవద్దు

వీరఘట్టం: రహదారుల భద్రతకు ముప్పు కలిగిస్తున్న ఇనుప చక్రాలతో ఉన్న ట్రాక్టర్లను రహదారులపై నడపవద్దని ఎస్.ఐ ఎంవీ రమణ సూచించారు. శుక్రవారం ఓ ఇనుప చక్రాల ట్రాక్టర్ రహదారిని ఛిద్రం చేస్తూ రావడాన్ని గమనించి ఆ ట్రాక్టర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు అవగాహన కల్పించారు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రహదారులు నిర్మిస్తుంటే మీరు ఇలా ట్రాక్టర్లు నడిపి రోడ్డును పాడు చేస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్‌ను ప్రశ్నించారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకోండి, రోడ్లను మాత్రం పాడుచేయవద్దని కోరారు.

పంట పొలాల పరిశీలన



వీపీ రాజుపేట కూడలి వద్ద నీట మునిగిన పంట భూములను పరిశీలిస్తున్న ఏవో

పాలకొండ రూరల్: నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయాధికారి ఎన్ని వాహిని శుక్రవారం పరిశీలించారు. పాలకొండ మండలం వీపీ రాజుపేట కూడలి, వీరఘట్టం రహదారిలో నీట మునిగిన పంట భూములను సంబంధిత రైతులతో కలసి సందర్శించారు. రైతులు తమ సమస్యలను వివరించారు. ఎగువ ప్రాంతాల్లో వాగులకు వరద పోటెత్తడంతో సమస్యలు తలెత్తినట్టు రైతులు తెలిపారు. వరి వెద చల్లిన రైతులు తమ పంటలు మొక్క దశలో ముంపునకు గురైనట్టు వివరించారు. సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఏవో ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. ఆమె వెంట గ్రామీణ వ్యవసాయ సహాయకుడు చందు తదితరులు ఉన్నారు.



పాలకొండ: కొండాపురం గ్రామంలో వరినాట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

పాలకొండ: భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రభుత్వం పంట పొలాలు పరిశీలనకు చర్యలు తీసుకుంది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం పంట పరిస్థితి, వరద నీటిపై నివేదికలు కోరడంతో శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పంటలను పరిశీలించారు. వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలు పరిశీలించి రైతులకు సూచనలు అందించారు. ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్న నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలో అధికంగా తంపర భూములు ఉన్న కొండాపురం, అంపిలి, గోపాలపురం, తంపటాపల్లి, రాజుపేట, బాసూరు తదితర గ్రామాల్లో అధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. సూచనలు పాటించి సాగు చేయాలని కోరారు.

చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ



రస్తాకుంటుబాయి కేవీకేలో చిరుధాన్యాల పంటలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం)లో ఒడిశాలోని బోయిపోడిగూడ గ్రామానికి చెందిన 20 మంది గిరిజన రైతులకు(ఒడిస్సా మిల్లెట్ మిషన్ కార్యక్రమంలో భాగంగా) చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.ప్రవంతి, డాక్టర్ జి.అమృతవీణ, డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ ఎం.అనంత విహారి, డాక్టర్ జి.అను, వై.ఉమాజ్యోతి వారికి అందించిన శిక్షణలో కేవీకే యొక్క ముఖ్య ఉద్దేశాలు వివరించారు. కేవీకేలో ఉన్న డెమో యూనిట్లుపై అవగాహన కల్పించారు. వివిధ రకాల చిరుధాన్యాల పంటలు (కొర్ర, సామ, ఊద, అరిక, అండు కొర్రలు, రాగులు) పంటల సాగుతో ప్రయోజనాలు, పంటల సాగులో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో సుమారు 15 రకాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై కూడా శిక్షణ ఇచ్చారు.

ఎంపీటీసీ మృతికి సంతాపం



మీనక అయోధ్య (ఫైల్)

కురుపాం: మండలంలోని జి.శివడ ప్రాదేశికానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు మీనక అయోధ్య(63) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున తన స్వగ్రామం మడ్డుగూడ గిరిజన గ్రామంలో మృతి చెందారు. ఈయన రెండు సార్లు సర్పంచ్‌గాను, రెండు సార్లు ఎంపీటీసీ సభ్యులుగా పని చేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మీనక అయోధ్య మృతిపై మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమ సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో పార్వతీపురం బైపాస్ రోడ్డులో ప్రారంభించనున్నట్లు మండల కన్వీనర్ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



నీటి తొట్టెలను శుభ్రం చేయిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండల కేంద్రంలో డ్రైడే సందర్భంగా పారిశుద్ధ్యం ప్రాముఖ్యతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలువల్లోని మురుగును తొలగించడంతో పాటు ఇంటి ముందు మురుగు నిల్వలు లేకుండా చేయాలని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారంలో ఒక రోజు డ్రైడేను పాటిస్తే దోమలు, ఈగలు ప్రబలకుండా ఉంటాయన్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకపోతే వ్యాధులు దరి చేరవన్నారు. ప్రజలు కూడా పారిశుద్ధ్యంపై సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి



మాట్లాడుతున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్

సీతంపేట: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థులకు క్రీడలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో విద్యార్థులు వివిధ రకాల క్రీడలు ప్రాక్టీస్ కావాలన్నారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఆర్చరీ తదితర క్రీడలు నేర్పడానికి కోచ్‌లు ఉన్నారని వారి సేవలు వినియోగించుకోవాలన్నారు. గతంలో ఇక్కడ నుంచే చిరంజీవి అనే విద్యార్థి జావెలిన్ త్రోలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.నాగభూషణరావు, పీడీ లక్ష్మణమూర్తి, కోచ్‌లు మధు, రాజేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకు బెంతు ఒరియాల వినతి



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బెంతు ఒరియాలు

వీరఘట్టం: బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చాలని కోరుతూ స్థానిక వడ్డివీధికి చెందిన బెంతు ఒరియా సామాజిక వర్గానికి చెందిన వారు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను కోరారు. శుక్రవారం వీరఘట్టం వచ్చిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు వారు కలసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఎస్టీలుగా ఉన్న తమను కొన్నేళ్లుగా ఆ జాబితాల నుండి తొలగించి బీసీ -ఏ కేటగిరీలో చేర్చారని తెలిపారు. దీని వల్ల ఎంతో వెనుకబడి ఉన్న తమ సామాజిక వర్గం వారు విద్య, ఉద్యోగ తదితర రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్సీ విక్రాంత్ తెలిపారు.

గడప గడపకూ సంక్షేమం

● ఎమ్మెల్యే కళావతి



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కొండాడ పంచాయతీ పరిధిలో బెన్నరాయి, అక్కన్నగూడ పాండ్ర, పాండ్ర, ఎగువ, దిగువ పాండ్ర తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లారు. సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికి ఎంత మొత్తం అందిందో కరపత్రాల ద్వారా వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శమన్నారు. గిరిజనులకు ఎటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. వరద గోడలు, డ్రైనేజీ, హౌసింగ్ బిల్లులు, విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యం, ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, సర్పంచ్ ముకుందరావు, ఎంపీటీసీ మంగయ్య, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎర్రయ్య, తెల్లయ్య, రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను దివ్యాంగులు ఉపయోగించుకోవాలి

గరుగుబిల్లి: దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగభూషణరావు అన్నారు. మండల పరిధిలోని కొత్తూరు క్లస్టర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రశస్త యాప్ రిజిస్ట్రేషన్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 17 నుండి మండలంలోని అన్ని గ్రామాల్లో ఐఈఆర్పీ, సీఆర్పీలు, పీటీఐలు ఇంటింటి సర్వేను నిర్వహించి దివ్యాంగులను గుర్తించడం జరిగిందన్నారు. మండలంలో గతంలో 96మంది దివ్యాంగులను గుర్తించగా ఈ సర్వేలో మరో 14మందిని గుర్తించారన్నారు. దివ్యాంగులకు ఎంఆర్సీలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు పొప్పికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. సర్వేలో ఐఈఆర్పీ వీర్రాజు, సీఆర్పీ రామకృష్ణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల యూనిట్ల ఏర్పాటు

భామిని: మండలంలోని బంద్రసింగి, ఏతంగూడ గిరిజన గ్రామాల్లో చిరుధాన్యాల ప్రాసెస్ యూనిట్లను హెచ్‌డీఎఫ్‌సీ ఆర్థిక సహాయంతో శుక్రవారం ప్రారంభించారు. వాస్సన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజనుల ఆర్థిక ప్రయోజనాల నిమిత్తం వీటిని ఏర్పాటు చేసినట్టు సంస్థ ఇన్‌చార్జి రవీంద్ర తెలిపారు. పరివర్తన పథకంలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో ఆధునిక యంత్ర సామగ్రి ఏర్పాటు చేస్తున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులు అమిత్, నీరజ్ తెలిపారు. చిన్న మూలగూడలో గిరిజనులతో నిర్వహిస్తున్న నాటుకోళ్ల ఫారం యాజమాన్య పద్ధతులపై మహిళలతో చర్చించారు. బొడ్డగూడలో సేంద్రియ సాగు యూనిట్, బియో రిసోర్సు సెంటర్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. చిరుధాన్యాల సాగుపై ఆరా తీశారు. పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

నేత్ర చికిత్సలకు అవ్వా, తాతల తరలింపు

కురుపాం: డా.వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అవ్వా, తాతలను శస్త్రచికిత్సలకు తరలిస్తున్నట్టు మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి 30 మంది అవ్వా, తాతలను విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయాల పరిధిలో గతంలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో కేటరాక్ట్, టెరిజియం సంబంధిత నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించామన్నారు.

పక్కాగా రేషన్ సరుకుల తూకం : జేసీ

పార్వతీపురంటౌన్: రేషన్ సరుకుల తూకం పక్కాగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి చౌక ధరల డీలర్లకు, చౌక ధరల డీలర్ల నుంచి రేషన్ కార్డు దారులకు అందే సరుకుల్లో ఎటువంటి తేడాలు ఉండరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని ఎనిమిది ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌ల పరిధిలో ఉన్న రేషన్ షాప్‌లకు శతశాతం సరుకులను రేషన్ డీలర్ సమక్షంలో తూకం వేసి అప్పగించాలని, రేషన్ డీలర్లు సంబంధిత ఎండీయూ ఆపరేటర్లకు శత శాతం తూకంతో అప్పగించాలని పేర్కొన్నారు. తేడాలు గమనిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని సూచించారు.